# నేడు చేప ప్రసాదం పంపిణీ

- నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో ఏర్పాట్లు పూర్తి
- ప్రారంభించనున్న స్పీకర్ గడ్డం ప్రసాద్
- 42 క్యూలైన్‌లు ఏర్పాట్లు
- పంపిణీ కేంద్రానికి ప్రత్యేక బస్సులు



నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో చేప ప్రసాదం కోసం ఏర్పాటు చేసిన క్యూలైన్లు



మైదానానికి చేరుకున్న ఆస్తమ వ్యాధిగ్రస్తులు

అబిడ్స్, జూన్ 7 : చేప ప్రసాదం పంపిణీకి అధికార యంత్రాంగం సర్వం సిద్ధం చేసింది. ఉబ్బస వ్యాధి గ్రస్తులకు బత్తిని కుటుంబీకులు ఇచ్చే చేప ప్రసాదాన్ని నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో ఆది, సోమవారాల్లో పంపిణీ చేయనున్నారు. ఆర్అండ్‌బీ అధికారులు క్యూలైన్‌ల కోసం బారికేడ్లను ఏర్పాటు చేశారు. జీహెచ్ఎంసీ అధికారులు పారిశుధ్యంతో పాటు మొబైల్ టాయిలెట్ల ఏర్పాటు, వాటర్‌వర్క్స్ అధికారులు మంచినీటి సరఫరాకు కౌంటర్లు ఏర్పాటు చేశారు. రెవెన్యూ యంత్రాంగం ప్రత్యేక సహాయ కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. వివిధ స్వచ్ఛంద సంస్థలు చేప ప్రసాదం స్వీకరించేందుకు వచ్చే ఆస్తమా వ్యాధిగ్రస్తులు వారి సహాయకులకు అల్పాహారాలు ఉచితంగా అందించేందుకు కౌంటర్లను ఏర్పాటు చేశాయి. అగర్వాల్ సమాజ్, జైస్వాల్ సమాజ్‌లతో పాటు వివిధ స్వచ్ఛంద సంస్థల వారు ప్రత్యేకంగా స్టాళ్లను ఏర్పాటు చేశారు. చేప ప్రసాదం కోసం వచ్చే ఉబ్బస వ్యాధిగ్రస్తులు నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానానికి చేరుకునేందుకు గాను నగరంలోని వివిధ రైల్వే స్టేషన్‌లు, బస్సు స్టేషన్ల నుంచి ప్రత్యేక ఆర్టీసీ బస్సులను ఎగ్జిబిషన్ మైదానానికి ఏర్పాటు చేశారు.

### ప్రత్యేక టోకెన్లు..

ఈ సంవత్సరం 42 క్యూలైన్లను ఏర్పాటు చేసి చేప ప్రసాదం పంపిణీ చేసేందుకు గాను అధికార యంత్రం ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఫిషరీస్ డిపార్ట్ మెంట్ ద్వారా లక్షకు పైగా చేప పిల్లలను అందుబాటులో ఉంచి అవసరాలను బట్టి మైదానానికి తరలించేందుకుగాను ఆ శాఖ వారు ఏర్పాట్లు చేపట్టారు. చేప ప్రసాదం కోసం సమయనుసారం ప్రత్యేక టోకెన్లు ఇవ్వనున్నట్లు, మీడియా ప్రతినిధుల కోసం ప్రత్యేక క్యూ లైన్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలంగాణ రాష్ట్ర ఫిషరీస్ ఫెడరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్ తెలిపారు.

### లక్షన్నర చేప పిల్లలు సిద్ధం..

చేప ప్రసాదం పంపిణీకి మత్స్య శాఖ ద్వారా లక్షన్నర చేప పిల్లలను సిద్ధంగా ఉంచుతున్నట్లు రాష్ట్ర ఫిషరీస్ ఫెడరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్ తెలిపారు. బీహార్, మహారాష్ట్ర, కర్ణాటక, జమ్మూ కశ్మీర్ తో పాటు ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన వ్యాధి గ్రస్తులకు ప్రత్యేక సదుపాయం ఏర్పాటు చేస్తామన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు మంత్రి పొన్నం ప్రభాకర్ సూచనల మేరకు చేప ప్రసాదాన్ని ప్రత్యేక ప్రణాళికతో గతంలో కంటే ఎక్కువ క్యూ లైన్లు ఏర్పాటు చేసి వివిధ సంస్థల ద్వారా పంపిణీ జరిగేలా ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఆదివారం ఉదయం తొమ్మిది గంటలకు మృగశిర కార్తె ప్రవేశిస్తుండటంతో శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ చేప ప్రసాదం పంపిణీ ప్రారంభిస్తారని, టీ పీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్ గౌడ్ తో పాటు మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్ హాజరు కానున్నట్టు తెలిపారు.

## కేటీఆర్‌కు శుభాకాంక్షలు



కేటీఆర్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే కేపీ వివేకానంద్, ఎమ్మెల్యేలు, ఎంపీలు

దుండిగల్, జూన్ 7: విదేశీ పర్యటనలో భాగంగా యూకే, యూఎస్‌ఏ దేశాల్లో పర్యటించి డల్లాస్ నగరంలో బీఆర్ఎస్ ఎన్నారై విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన బీఆర్ఎస్ రజతోత్సవ వేడుకలను దిగ్విజయంగా పూర్తి చేసుకొని హైదరాబాద్ నగరానికి తిరిగి వచ్చిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేల బృందం, నేతలు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛాన్ని అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కలిసిన వారిలో ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్, ఎమ్మెల్యేలు కాలేరు వెంకటేశ్, కొత్త ప్రభాకర్ రెడ్డి, బండారి లక్ష్మారెడ్డి, రాష్ట్ర నాయకులు, కార్పొరేషన్ మాజీ చైర్మన్ రవీందర్ రావు తదితరులు ఉన్నారు.

## వైభవంగా పట్టాభిషేక మహోత్సవం



పట్టాభిషేకంలో పాల్గొన్న శ్రీ సిద్ధేశ్వరానంద భారతి మహాస్వామి

ఆర్కేపురం, జూన్ 7 : తమిళనాడు కుర్తాళంలోని ప్రసిద్ధి చెందిన శ్రీ సిద్ధేశ్వరి పీఠం పీఠాధిపతులు జగద్గురువులు శ్రీశ్రీశ్రీ సిద్ధేశ్వరానంద భారతి మహాస్వామి వారితో పీఠం ఉత్తర పీఠాధిపతులుగా శ్రీ దత్తేశ్వరానందభారతి స్వామి వారి పట్టాభిషేకం వైభవంగా జరిగింది. పీఠం మేనేజర్ శ్రీ మూర్తి రాజు మాట్లాడుతూ తెలుగు వారైనా శ్రీ మౌన స్వామి స్థాపించిన శ్రీ సిద్ధేశ్వరి పీఠంలో ఎందరో ఋషులు, మునులు తపస్సు , సాధన చేసిన ప్రదేశమని దేశం నలుమూలల నుంచి ప్రతినిత్యం భక్తులు వచ్చి ఇక్కడ సాధన చేస్తారని తెలిపారు. పీఠ పురోహితులు శ్రీ మాచవోలు రమేశ్ శర్మ ఆధ్వర్యంలో జరిగిన పట్టాభిషేకం మహోత్సవాల్లో ఐదు రోజులుగా పీఠ దేవతలకు విశేష అభిషేకం, పూజలు,అర్చనలు, హోమాలు, లలితా కామేశ్వరుల కల్యాణోత్సవం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ సురభి వాణీదేవి , ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచన కర్త అనంతలక్ష్మి , శ్రీ మా శర్మ భక్తులు పాల్గొన్నారు.

## రాష్ట్ర సాధనలో కళాకారుల పాత్ర కీలకం



అవార్డులను ప్రదానం చేస్తున్న మాజీ శాసనసభాపతి మధుసూదనాచారి

తెలుగు యూనివర్సిటీ, జూన్ 7: తెలంగాణ మలిదశ ఉద్యమంలో కళాకారులు కీలక పాత్ర పోషించారని మాజీ శాసనసభాపతి , శాసనమండలి సభ్యుడు సిరికొండ మధుసూదనాచారి అన్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా ఉజ్వల సామాజిక స్వచ్ఛంద సేవ సంస్థ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం 'సకల కళావైభవం' కార్యక్రమాన్ని తెలంగాణ సారస్వత పరిషత్‌లో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన మధుసూదనాచారి మాట్లాడుతూ.. తెలంగాణ మలిదశ ఉద్యమంలో కవులు, కళాకారులు ప్రముఖ పాత్ర పోషించారని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత మరుగున పడిన కలలను వెలికి తీసి ప్రోత్సహించారని తెలిపారు. అనంతరం వివిధ రంగాల్లో సేవలందిస్తున్న వారికి ఐకాన్ అవార్డుల ప్రదానం చేశారు. ప్రముఖ సంఖ్యాశాస్త్ర నిపుణుడు దైవజ్ఞ శర్మ సభాధ్యక్షత వహించిన కార్యక్రమంలో రామ ఆగ్రోటెక్ ఇండియా డైరెక్టర్ అనిల్‌యాదవ్, ప్రముఖ సినీనటి రాగిణి, బీజేవైఎం సోషల్ మీడియా కన్వీనర్ గౌతమ్ వెలివేటి, ధర్మశాస్త్ర పీఠం వ్యవస్థాపక అధ్యక్షుడు రుద్ర కోటేశ్వరరావు, గురుస్వామి డాక్టర్ ఈశ్వరయ్య , సంస్థ అధ్యక్షురాలు లక్ష్మి పాల్గొన్నారు.



## అంకిత భావంతో సేవలు అందించాలి

జవహర్‌నగర్, జూన్ 7 : విధి నిర్వహణలో బాధ్యతలు స్వీకరిస్తున్నందున దేశ సమగ్రతను శిక్షణలో నేర్చుకున్న అత్యున్నత ప్రమాణాలను ప్రదర్శించాలని సీఐఎస్ఎఫ్ ఇన్‌స్పెక్టర్ జనరల్ (ఐజీ) నీలిమా రాణి సింగ్ సూచించారు. శనివారం హకీంపేట జాతీయ పారిశ్రామిక భద్రత శిక్షణ అకాడమీ (నేషనల్ ఇండస్ట్రీయల్ సెక్యూరిటీ అకాడమీ) నిసా దీక్షత్ పరేడ్ గ్రౌండ్‌లో 48వ బ్యాచ్‌కు చెందిన 347 మంది ఎస్సైల పాసింగ్ అవుట్ పరేడ్ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పట్టుదల కార్యదీక్షతతో దేశ భద్రతకు ఎస్సైలు అంకిత భావంతో సేవలు అందించాలని సూచించారు. సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కొంటూ నైపుణ్యతను రోజు రోజుకు మెరుగు పర్చుకోవాలని అన్నారు. ఈ శిక్షణలో బెస్ట్ ఆల్‌రౌండర్ బెస్ట్ ఇండోర్ ట్రైనీగా దినేశ్, బెస్ట్ ఇన్ ఫైర్ నీరజ్ బగ్లెల్‌లకు ఐజీ నీలిమా రాణి సింగ్ అవార్డులను అందజేశారు. ఈ కార్యక్రమంలో హకీంపేట నేషనల్ ఇండస్ట్రీయల్ సెక్యూరిటీ అకాడమీ డిప్యూటీ డైరెక్టర్, డీఐజీ శ్రీనివాసబాబు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## మూతపడుతున్న పెయింగ్ గెస్ట్ హాస్టళ్లు

### బెంగళూర్ ఐటీ కారిడార్‌లో మూసివేత
### లేఆఫ్‌లు, బీబీఎంపీ నిబంధనలే కారణం

సిటీ బ్యూరో, జూన్ 7 (నమస్తే తెలంగాణ): దేశంలోని ప్రధాన నగరాల్లో పెయింగ్ గెస్ట్ హాస్టళ్లు వేలాదిగా ఉన్నాయి. ముఖ్యంగా హైదరబాద్, బెంగళూరు, ముంబై వంటి మెట్రో నగరాల్లో వీటి సంఖ్య అధికంగా ఉంది. ఐటీ కంపెనీలు, మల్టీ నేషనల్ కంపెనీలు, ప్రముఖమైన విద్యాసంస్థలు ప్రధాన నగరాల్లో ఉండటం వల్ల విద్యార్థులు, ఉద్యోగులు ఎక్కువగా ఉండటం వల్ల పెయింగ్ గెస్ట్(పీజీ) హాస్టళ్లు వేలాదిగా వెలిశాయి. వీటిలో ఉండేందుకు వారు కల్పించే వసతులను బట్టి నెలకు రూ.5 వేల నుంచి రూ.20 వేల వరకు ఉంటుంది. కానీ బెంగళూరులో ఇప్పుడు పీజీలు డజన్ల కొద్దీ మూతపడుతున్నాయి. దీనికి కారణం అక్కడి ప్రముఖ ఐటీ కంపెనీల్లో లేఆఫ్‌లు ప్రకటించడం, దానికి తోడు బృహత్ బెంగళూరు మహానగర పాలిక (బీబీఎంపీ) అమలు చేస్తున్న కఠినమైన నిబంధనలేనని తెలుస్తున్నది. దీంతో వేలాది మంది పెయింగ్ గెస్ట్ హాస్టళ్ల యజమానులపై దీని ప్రభావం పడే అవకాశం ఉన్నట్లు అక్కడి మార్కెట్ ఎనలిస్టులు సోషల్ మీడియా వేదికగా ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. నగరంలోని టెక్ కంపెనీల నష్టాల ప్రభావం గృహ సంక్షోభానికి కారణం అవుతుందని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. బెంగళూరు పరిసరాల్లోని మహాదేవపుర, మారతహళ్లి వంటి ప్రాంతాల్లోని పీజీలు 25 శాతం వరకు ఆదాయాన్ని కోల్పోతున్నాయని అంటున్నారు. మహాదేవపురలో మాత్రమే 100 కి పైగా పీజీలను ఇప్పటికే మూసివేశారని చెబుతున్నారు. నగరంలోని టెక్ బెల్ట్‌లలో ఇప్పుడు ప్రతిరోజూ రెండు పీజీలు మూతపడుతున్నట్లు అంచనా వేస్తున్నారు. దీనికి తోడు బీబీఎంపీ వాణిజ్య లైసెన్సులు, పరిశుభ్రత, అగ్నిమాపక భద్రతపై నిబంధనలు కఠినతరం చేయడంతో 40 అడుగుల కంటే ఇరుకైన రోడ్లపై పీజీలను నిషేధిస్తున్నది.

### నగరంలోనూ ఇదే పరిస్థితి ..

బెంగళూరు పరిస్థితే హైదరాబాద్‌లోనూ ఏర్పడే అవకాశం ఉందని టెక్ నిపుణులు చెబుతున్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి రియల్ ఎస్టేట్ రంగం పడిపోవడం, నూతన ఐటీ కంపెనీలు రాకపోవడంతో పెయింగ్ గెస్ట్ హాస్టళ్లపై ప్రభావం పడే చాన్స్ ఉండే అవకాశం ఉంది. గడిచిన పదేండ్లలో నగరంలో రియల్ ఎస్టేట్ రంగం పరుగులు తీయడం, ఐటీ కంపెనీలు పెరగడంతో పీజీలకు డిమాండ్ విపరీతంగా పెరిగింది. దీంతో ఆయా ప్రాంతాల్లోని వారు బిల్డింగ్‌లను నిర్మించి పీజీలుగా మారుస్తున్నారు. కానీ ప్రస్తుతం పరిస్థితులు పూర్తిగా మారడంతో హైదరాబాద్‌లోని పీజీ హాస్టళ్ల భవిష్యత్తు అంధకారంలో పడింది. పీజీ హాస్టళ్ల యజమానులతో పాటు వాటిలో పనిచేసేవారిపైనా దీని ప్రభావం ఉంటుందని నిపుణులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

## మోసం చేయడమే కాంగ్రెస్ విధానం

### రంగారెడ్డి జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ వెంకటరమణారెడ్డి

హైదరాబాద్, జూన్ 7 (నమస్తే తెలంగాణ): తెలంగాణను విఫలప్రయోగంగా చూపడానికి కాంగ్రెస్ వాళ్లు కుట్రలు చేస్తున్నారని రంగారెడ్డి జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ సత్తు వెంకటరమణరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. సబ్బండ వర్గాలను ఏకం చేసి, ప్రత్యేక రాష్ట్రం సాధించిన కేసీఆర్‌ను దొంగదెబ్బ తీసి, తెలంగాణను ఆగం చేయడానికి కుట్రలు పన్నుతున్నారని ధ్వజమెత్తారు. రాష్ట్రాన్ని తెలంగాణ వ్యతిరేకుల కుట్రల నుంచి కాపాడుకోవడానికి సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలని వారు పిలుపునిచ్చారు. తెలంగాణకు మొదటి నుంచి కాంగ్రెస్ బద్ధ శత్రువే అని, తెలంగాణ ప్రజలను మోసం చేయడమే ఆ పార్టీ విధానమని ఆయన దుయ్యబట్టారు.





శనివారం తెలంగాణ భవన్‌లో కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇస్తున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు, పాల్గొన్న మాజీ మంత్రులు, బీఆర్‌ఎస్ నాయకులు, ఆర్థిక నిపుణులు

## కొండ నాలుకకు మందేస్తే!

(మొదటిపేజీ తరువాయి)

మరోవైపు వాహనదారులు సైతం తమ పనులు మానుకొని సేవల కోసం ఆర్టీఓ కార్యాలయానికి వస్తే పనికాకపోతుండటంతో అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో సారథి పోర్టల్ సేవలు రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేయడం గగనమే. ఇప్పటికే అధికారులు పోర్టల్ పనితీరుపై రిపోర్ట్ ఇచ్చారు. అయితే ఆ సాంకేతిక సమస్యలు పరిష్కరించకుండా సారథి పోర్టల్ అమలు చేస్తే అసలుకే మోసం వస్తుందని నివేదించినట్టు తెలిసింది. కాగా, సికింద్రాబాద్ మినహా ఇతర ఆర్టీఓ కార్యాలయాల్లో సాంకేతిక సమస్యలు ఉత్పన్నమైనా వెంటనే ఆ సమస్యను ఐటీ టీం పరిష్కరించి సేవలు సకాలంలో అందేల చేస్తుండటం విశేషం.

## ఇందిరమ్మ ఇండ్లు కాంగ్రెసోళ్ల కేనా?



(మొదటిపేజీ తరువాయి)

పథకానికి అనర్హులను ఎంపిక చేశారని, అసలైన అర్హులు మేడ్చల్ మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డికి ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే.

### ఆ నేతల ఆదేశాలతో ఇందిరమ్మ ఇండ్లు

కాంగ్రెస్ నేతల ఆదేశాలతోనే ఇందిరమ్మ ఇండ్లు మంజూరును అధికారులు చేస్తున్న క్రమంలో అసలైన అర్హులకు ఇందిరమ్మ ఇండ్లు వచ్చే అవకాశం లేదని తెలుస్తోంది. అధికారుల మాట చెల్లుబాటు కాకపోవడంతో దరఖాస్తుదారులు ఆందోళన చెందుతున్నారు. జిల్లా వ్యాప్తంగా ఇందిరమ్మ ఇండ్ల మంజూరుకు సంబంధించి ఇప్పటి వరకు మేడ్చల్, కుత్బుల్లాపూర్ నియోజకవర్గాల్లో మాత్రమే ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేశారని, ఇంకా ఇప్పటి వరకు మల్కాజిగిరి, కూకట్‌పల్లి, ఉప్పల్ నియోజకవర్గాల్లో దరఖాస్తుల పరిశీలనే ప్రారంభం కాలేదని అధికారులు పేర్కొంటున్నారు.

### అనర్హులకు కేటాయించిన ఇండ్లను రద్దు చేయాలి..

మేడ్చల్ మున్సిపాలిటీ పరిధిలో అనర్హులకు కేటాయించిన ఇందిరమ్మ ఇండ్లను రద్దు చేయాలని అసలైన అర్హులు డిమాండ్ చేస్తున్నారు. ఇందిరమ్మ ఇంటి పథకాన్ని కాంగ్రెస్ నాయకులు అనుచరులు, వారి బంధువుల కోసం ప్రవేశపెట్టారా అని ప్రశ్నిస్తున్నారు. ఇందిరమ్మ ఇండ్ల ఎంపికలో కాంగ్రెస్ నాయకులు జోక్యం లేకుండా చేసి అర్హులకు ఇండ్లను కేటాయించాలని అధికారులను కోరుతున్నారు. జిల్లా వ్యాప్తంగా ఇలానే జరిగితే ఇందిరమ్మ పథకం కాంగ్రెస్ నాయకులకే పరిమితమవుతుందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.



## విద్యార్థులు నిరంతరం నేర్చుకోవాలి

సిటీబ్యూరో, జూన్07, (నమస్తే తెలంగాణ): విద్యార్థులు నిరంతరం నేర్చుకుంటూనే ఉండాలని, నేర్చుకోవాలనే తపనను బతికించాలని జేబీఈఎస్ కార్యదర్శి జేవీ కృష్ణారావు అన్నారు. జేబీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ నిర్వహించిన ప్లేస్‌మెంట్ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. జేబీఐఐఏఐ కి చెందిన ఏడుగురు యువ వ్యవస్థాపకులను ఆయన ప్రశంసించారు. క్యాంపస్ ప్లేస్‌మెంట్‌లలో రాణించడమే కాకుండా దేశం అంతటా సివిల్ సర్వీస్‌లలో రాణించినందుకు అభినందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రచయిత, ఆర్థికవేత్త డాక్టర్ వికాస్ సింగ్ పాల్గొని ప్రసంగించారు. ఏడీవీఐ గ్రూప్‌లో రూ.11.5 లక్షల అత్యధిక ప్యాకేజీతో 600కు పైగా విద్యార్థులు ఎంపిక కావడం గమనార్హం.

## సైనికుల కుటుంబాలకు అండగా ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ సైనికులు

ఖైరతాబాద్, జూన్ 7 : సైనికుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉండాలని అఖిల భారత పూర్వ సైనిక్ సేవా పరిషత్ విజ్ఞప్తి చేసింది. శనివారం సాయంత్రం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సమితి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రిటైర్డ్ కల్నల్ శ్రీనివాస్ రావు, పీఎస్ఎన్ స్వామి మాట్లాడుతూ జగిత్యాల జిల్లాలోని ఓ గ్రామంలో దేశ సరిహద్దులో ఆపరేషన్ సిందూర్‌లో పాల్గొన్న ఇద్దరు సైనికుల కుటుంబాలను వారి స్వగ్రామంలో స్థానికంగా కొందరు వేధింపులకు గురి చేశారని, ఈ విషయాన్ని పోలీసు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లగా తక్షణమే స్పందించి రక్షణ కల్పించారని, బాధ్యులపై చర్యలు తీసుకున్నారన్నారు. మాజీ సైనికుల సంక్షేమం హోం శాఖ పరిధిలో ఉందని, ముఖ్యమంత్రి ఆ శాఖను స్వయంగా నిర్వహిస్తున్నారని, కాని ఇప్పటి వరకు ఒక్క సమీక్ష నిర్వహించలేదన్నారు. టీజీపీఎస్సీ గ్రూప్ 3, గ్రూప్ 4 పోస్టుల్లో 2 శాతం రిజర్వేషన్లు కల్పించాల్సి ఉండగా అది చేయలేదన్నారు. క్వాలీఫై మార్కులు 40 శాతం విధించి ఖాళీలను మాత్రం మళ్లీ జనరల్ కేటగిరికి మార్చుతున్నారన్నారు. సైనికులకు కేటాయించిన భూములు అన్యాక్రాంతమవుతున్నాయని, కనీసం 175 గజాల స్థలం ఒక సైనికుడి కుటుంబానికి కేటాయించాలన్నారు. ఈ సమావేశంలో రమేశ్, సురేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఆఫ్రికా నుంచి విమానంలో తీసుకొచ్చి..

### చికిత్స చేసి ప్రాణాలు కాపాడిన కిమ్స్ వైద్యులు



సిటీబ్యూరో, జూన్7,(నమస్తే తెలంగాణ): సెప్సిస్ సమస్యతో ఊపిరి తీసుకునేందుకు ఇబ్బందిపడుతున్న వ్యక్తిని ఆఫ్రికా నుంచి విమానంలో తీసుకువచ్చి 23 రోజుల పాటు చికిత్స అందించి ప్రాణాలు కాపాడారు కిమ్స్ వైద్యులు. వైద్యులు తెలిపిన వివరాల ప్రకారం..కాకినాడకు చెందిన 60 ఏళ్ల ఉదయ్ 20 ఏళ్లుగా ఆఫ్రికాలోని ఘనా దేశంలో వ్యాపారవేత్తగా స్థిరపడ్డారు. ఆయన అక్కడ తీవ్రంగా ఫాల్సీపారం మలేరియాకు గురయ్యారు. ఆ తర్వాత సెప్సిస్ సమస్య వచ్చింది. దీంతో పాటు ఎక్యూట్ రెస్పిరేటరీ డిస్ట్రెస్ సిండ్రోమ్ (ఏఆర్‌డీఎస్) కూడా రావడంతో ఆయనకు ఊపిరి అందని పరిస్థితి ఏర్పడింది. అక్కడి వైద్యులు కిమ్స్ వైద్యులను సంప్రదించి వారి సూచనల మేరకు వెంటిలేటర్ మీద పెట్టి ప్రత్యేక విమానంలో కొండాపూర్‌లోని కిమ్స్ ఆస్పత్రికి తరలించారు. ఆయనకు చికిత్స ప్రారంభించి అంతర్జాతీయ స్థాయి క్రిటికల్ కేర్ చికిత్సలు 23 రోజుల పాటు అందించి ప్రాణాలు కాపాడినట్లు తెలిపారు. చికిత్సలు అందించినవారిలో ఇంటర్నల్ మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ రవిశేఖర్ రెడ్డి, క్రిటికల్ కేర్ కన్సల్టెంట్ డాక్టర్ పంకజ్ తో పాటు పల్మనాలజిస్ట్ డాక్టర్ అవినాశ్, కార్డియాలజిస్ట్ డాక్టర్ శ్యాంసుందర్ రెడ్డి, నెఫ్రాలజిస్ట్ డాక్టర్ శ్యామ్ సుందర్ రావు, సాంక్రమిక వ్యాధుల నిపుణుడు డాక్టర్ పాటిల్ ప్రతీక్ యశ్వంత్, గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్ డాక్టర్ వెంకటేశ్ పబ్బిశెట్టి తదితరులు ఉన్నారు.

# పరిహారం మూడింతలైతే ఓకే?

(మొదటిపేజీ తరువాయి)

భూసేకరణకు ముందుకు రావాలని కోరినా బాధితులు ఆసక్తి చూపకుండా.. ప్రాజెక్టును వ్యతిరేకిస్తున్నారు. దీంతో ఇప్పటివరకు జరిగిన గ్రామ సభలన్నింటిలోనూ నిరసన వ్యక్తం చేస్తూ తాము ప్రాజెక్టు కోసం భూములు ఇచ్చేది లేదంటున్నారు.

### డిఫెన్స్ తరహాలో పరిహారం

ఈ రెండు ప్రాజెక్టుల కోసం డిఫెన్స్ శాఖ 160 ఎకరాలకు పైగా భూమిని కోల్పోతున్నది. దీనికి పరిహారం మూడింతలు ఇవ్వాలనే ప్రతిపాదనలు ఉంది. ఇదే తరహాలో ప్రైవేటు ఆస్తుల విషయంలోనూ పరిహారం చెల్లించాలనే ప్రతిపాదన తెరమీదకు వచ్చింది. ఇదే గనుక జరిగితే ప్రాజెక్టుతో తాము కోల్పోతున్న జీవనోపాధికి భరోసానిచ్చేలా పరిహారాన్ని కోరుతున్నారు. తాము కోల్పోతున్న భూమికి మూడింతలు భూమిని అన్ని వసతులు, అభివృద్ధికి ఆస్కారం ఉండే ప్రాంతాల్లో పరిహారం చెల్లించాలని కోరుతున్నారు. అదేవిధంగా గతంలో ఉప్పల్ రోడ్ల విస్తరణ సమయంలోనూ ఇదే తరహాలో వచ్చిన సమస్యను పరిష్కరించిన యంత్రాంగం.. బాధితులతో చర్చలు జరిపి ప్రాజెక్టు కోసం భూములు తీసుకుందని గుర్తు చేస్తున్నారు. కానీ ఈ ప్రాజెక్టు కోసం రాజీవ్ రహదారి వెంబడి ఉన్న వందలాది ఇంటి యాజమానులను రోడ్డున పడేలా ప్రభుత్వం వ్యవహరిస్తుందని వాపోతున్నారు. కనీసం రోడ్డు వెడల్పు 200 ఫీట్ల నుంచి 100 ఫీట్లకు తగ్గించిన తమకు ఆస్తులకు కొంత భరోసా ఉంటుందని వాపోతున్నారు. కానీ ప్రభుత్వం ఆ దిశగా చర్చలు చేయకుండానే భూములు లాగేసుకునేలా వ్యవహరిస్తోంది. కనీసం కోల్పోతున్న భూములకు పరిహారాన్ని మూడింతలు చేయాలని డిమాండ్ చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు.

### నేడు భేటీ కానున్న జేఏసీ

ఓవైపు ఎలివేటెడ్ కారిడార్ విషయంలో ప్రభుత్వం భూసేకరణ చేయకుండానే... ఏకపక్షంగా ప్రకటనలు చేస్తోంది. మరో వైపు భూములు కోల్పోతున్న వారికి ఎలాంటి భరోసా ఇవ్వకుండానే భూ సేకరణ కోసం గ్రామ సభలు నిర్వహిస్తోంది. ఇప్పటివరకు నిర్వహించిన గ్రామ సభలన్నింటిని తాము వ్యతిరేకించామని, ప్రాజెక్టును అడ్డుకోవడం లేదని, తమ ఆస్తులు, జీవనోపాధికి భరోసా కల్పించాలని డిమాండ్ చేస్తున్నా ప్రభుత్వ యంత్రాంగం పట్టించుకోవడం లేదని రాజీవ్ రహదారి జేఏసీ నాయకులు వాపోతున్నారు. దూకుడుగా వ్యవహరిస్తున్న ప్రభుత్వ తీరుకు వ్యతిరేకంగా ఉద్యమించేందుకు ఇవాళ భేటీ కానున్నారు. ఈ సమావేశంలో తీసుకుని ఏకగ్రీవంగా ఉద్యమ కార్యాచరణ ఉంటుందని జేఏసీ నాయకులు సతీష్ తెలిపారు.